RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 82 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 27 సెప్టెంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# దసరాకు 'కేబినెట్' ధమాకా!

## వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పుడైనా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ!

### పీసీసీ అధ్యక్ష నియామకం పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. దసరా పండుగ సమయంలో కొత్త మంత్రులను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అడ్డంకులు తొలగినట్టేనని, ఈసారి మంత్రివర్గ విస్తరణ ఖాయమని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే నెల 5వ తేదీ తర్వాత ఎప్పుడైనా కొత్త మంత్రులు కొలువుదీరనున్నారని నేతలు చెబుతున్నారు. ఎవరెవరికి చాన్స్ ఇవ్వాలన్న దానిపై మరోమారు చర్చలు జరిపి ఖరారు చేయనున్నట్టు వివరిస్తున్నారు.

**బెర్తుల కోసం పోటాపోటీ :** నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో గరిష్టంగా సీఎం సహా 18 మందికి మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రులు ఉన్నారు.

దీనితో మరో ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించే వెసులుబాటు ఉంది. వీటి కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. తమకంటే తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్లో ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచే కాకుండా.. మిగతా జిల్లాల నుంచి కూడా డజను మందికి పైగా ఎమ్మెల్యేలు తమకు కేబినెట్ బెర్తుపై ఆశతో ఉన్నారు.

ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచి పరిశీలిస్తే.. మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), జి.వివేక్, జి.వినోద్, కె.ప్రేమ్‌సాగర్‌రావు (ఆదిలాబాద్), పి.సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్), దానం నాగేందర్, అమీన్ అలీఖాన్ (హైదరాబాద్) మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ (నల్లగొండ), వాకిటి శ్రీహరి (మహబూబ్‌నగర్), టి.జీవన్‌రెడ్డి (కరీంనగర్) కూడా కేబినెట్ బెర్త్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. వీరికితోడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావు, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు కూడా సామాజిక వర్గాల ప్రాతిపదికన చాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

**సామాజిక సమీకరణాలే ప్రాతిపదికగా..** కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న దానిపై అధిష్ఠానం ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పదవికి, కేబినెట్ విస్తరణకు మధ్య సామాజిక వర్గాల వారీగా లెక్కలు కుదరకపోవడంతో నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతను నియమించడంతో మిగతా సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయంలో ఓ నిర్ణయం తీసుకునే వెసులుబాటు కలిగింది. ప్రస్తుత మంత్రిమండలిలో ఏడుగురు ఓసీ వర్గానికి చెందినవారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు బీసీలు, ఒక ఎస్టీ నేత ఉన్నారు.

కులాల వారీగా చూస్తే నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. ప్రస్తుతం రెడ్లకే చెందిన మరో నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వనున్నట్టు అంచనా. మాదిగ, ఎస్టీ (లంబాడా), బీసీ సామాజిక వర్గాలకు కూడా ఒక్కో బెర్త్ కేటాయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. మిగతా రెండు పదవులు ఎవరికన్నది పార్టీ వెసులుబాటు ప్రకారం కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

**ఇతర పదవుల భర్తీ కూడా..** వివిధ వర్గాలకు మంత్రివర్గంలో స్థానంతోపాటు అసెంబ్లీలో చీఫ్ విప్, విప్ పదవులు కూడా ఇచ్చే చాన్స్ ఉంది. వీటితోపాటు కీలకమైన ఆర్టీసీ, మైనింగ్, ఎంఐడీసీ, మూసీ డెవలప్‌మెంట్ వంటి కీలక కార్పొరేషన్లకు ఎమ్మెల్యేలను చైర్మన్లుగా నియమిస్తారనే చర్చ జరుగుతోంది.

ఈ క్రమంలో ఏ పదవి ఎవరికి ఇవ్వాలన్న దానిపై సామాజిక వర్గాల కోణంలో నిర్ణయం ఉంటుందని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత.. ఆయనతోపాటు సీఎం రేవంత్, సీనియర్ మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఢిల్లీ వెళ్లి.. అధిష్ఠానంతో చర్చించనున్నట్టు సమాచారం. మొత్తమ్మీద దసరా పండుగకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే చర్చ.. రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఆసక్తి రేకెత్తిస్తోంది.




## అధికారులకు కేటీఆర్ మాస్ వార్నింగ్

హైదరాబాద్: అధికారులు, పోలీసులు ప్రభుత్వానికి వత్తాసు పలకకూడదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు పేర్కొన్నారు. అలా చేసిన వారికి ప్రస్తుతం ఏపీలో ఏం జరుగుతుందో చూస్తున్నారుగా అని అధికారులను హెచ్చరించారు. సిరిసిల్లలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారులు కాంగ్రెస్ నేతల్లా, కార్యకర్తల్లా అత్యుత్సాహాన్ని ప్రదర్శించకూడదన్నారు. ఏపీలో ఆల్ ఇండియా సర్వీస్ అధికారులను కూడా సస్పెండ్ చేశారని.. ఈ విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు చట్టం ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్టు చేస్తాం అంటే ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు.

**వారంతా సిద్ధంగా ఉండాలి..** రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్న విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై కేటీఆర్ స్పందించారు.

పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని.. కడియంతోపాటు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన వారికి పరాభవం తప్పదని కేటీఆర్ విమర్శించారు.

**రోడ్డునపడ్డ నేతన్నల కుటుంబాలు..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయంగా తన మీద ఉన్న కోపంతో రాజన్న సిరిసిల్ల ప్రజల మీద, నేతన్నల మీద పగ తీర్చుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో నేతన్నల ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ఉన్నప్పుడే బీఆర్ఎస్ తరఫున రూ.50 లక్షలు పద్మశాలి ట్రస్ట్‌కు ఇచ్చి సిరిసిల్లను ఆదుకున్నట్లు చెప్పారు. విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకకు ఇచ్చే చీరలను సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ దివాలాకోరు ఆలోచనల వల్ల రాష్ట్రంలోని కోటిమందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మీద కక్ష ఉంటే తనపైనే తీర్చుకోవాలని.. కానీ నేతన్నలను ఇబ్బంది పెట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## డీజేలతో ఇబ్బందులు.. త్వరలోనే ఆంక్షలు....




హైదరాబాద్ : ఏవైనా పండుగలు.. ఉత్సవాలు.. ర్యాలీలు అంటే వెంటనే గుర్తొచ్చేది డీజే.. ప్రస్తుతం డీజే ఓ ట్రెండ్‌గా మారింది. డీజే లేకపోతే ఫుల్ బోర్.. ఓ వైపు డీజే పేరుతో పెద్ద పెద్ద సౌండ్స్ పెట్టి డ్యాన్స్ చేయడం దాదాపు అన్ని ర్యాలీల్లో చూస్తున్నాం. ఈ డీజే సౌండ్స్‌పై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. పెద్ద పెద్ద సౌండ్స్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు నగర వాసులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో డీజేల నియంత్రణపై హైదరాబాద్ పోలీసులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వినియోగంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులతో పాటు, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రాపాలీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**డీజే శబ్దాలపై ఫిర్యాదులు..** డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ సౌండ్స్‌తో నివాసాల్లో వయసు మీరిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారని, డీజే సౌండ్స్ శృతి మించుతున్నాయన్నారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మిలాద్ ఉన్ నబి వేడుకల్లోనూ డీజే నృత్యాలు విపరీతమయ్యాయని చెప్పారు. పండుగలు, ఉత్సవాలు లేదా ఏదైనా ర్యాలీల్లో డీజేలు ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు.


పబ్‌లో డ్యాన్సులు చేసినట్లే ర్యాలీల్లో చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని వివిధ సంఘాల నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ మత సంఘాల ప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అందరి అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం డీజేలపై ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు.

**డీజేలపై ఆంక్షలు పెడతారా..** మితిమీరిన సౌండ్స్‌తో డీజేల వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీజేలపై పలు ఆంక్షలు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీజేలు పెట్టడానికి సమయాలను నిర్దేశించడంతో పాటు, సౌండ్ పర్సంటేజీపై ఆంక్షలు పెట్టడంతో పాటు.. ఏయే సందర్భాల్లో డీజే వినియోగించాలి, ఏ సందర్భాల్లో డీజేలు ఉపయోగించకూడదనే దానిపై మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అలాగే ఏయే ప్రదేశాల్లో డీజేను అనుమతించాలి. ఏ ప్రదేశాల్లో అనుమతించకూడదనే విషయంలోనూ ప్రభుత్వం కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించనుందనే చర్చ జరుగుతోంది. పోలీసు అధికారుల నివేదిక తర్వాత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది తెలియాల్సి ఉంది.

# బుస్సలు తగ్గట్లేదబ్బా...!

## జోరందుకున్న ఆపరేషన్ 'మూసీ'



హైదరాబాద్, సెప్టెంబర్ 26: ఆపరేషన్ మూసీ పనులు జోరందుకున్నాయి. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర సర్కార్ స్పీడ్ పెంచింది. మూసీ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించిన వెంటనే సుందరీకరణ పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మూసీ నిర్వాసితుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. పునరావాసం కోసం పేదల వివరాల సేకరించే పనిలో పడ్డారు అధికారులు. పునరావాసం తర్వాతే ఇళ్ళు కూల్చివేయాలని సర్కార్ నిర్ణయించింది. అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. మూసీ నదిని ఆక్రమణ నుంచి విడిపించేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. మూసి రివర్ బెడ్‌లో 2,166 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే అత్యధికంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఆక్రమణలను అధికారులు గుర్తించారు.

**అధికారులకు సవాల్..** మరోవైపు మూసీ నివాసితుల ప్రాంతాల్లో ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మూసీ బాధితుల వివరాలు సేకరించడానికి అధికారులు రంగంలోకి దిగగా.. నివాసులు అడ్డుకుంటున్నారు. గురువారం ఉదయం మూసీ రివర్ బెడ్‌లో 25 ప్రత్యేక సర్వే బృందాలు చేరుకున్నాయి. ఒక్కో టీమ్‌లో తహసీల్దార్‌తో పాటు ఐదుగురు ఆఫీసర్లు ఉన్నారు. రివర్ బెడ్‌లో మొత్తం 2,166 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు.. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ఇళ్ళతో పాటు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే పలు ప్రాంతాల్లో సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. దీంతో మూసీ నివాసితుల సర్వే అధికారులకు సవాల్‌గా మారింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇళ్లను అధికారులు మార్క్ చేస్తున్నారు.

**1,600 నిర్మాణాలు గుర్తింపు..** మూసీ ఆక్రమణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. ఇదే విషయమైన బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1,600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించినట్లు దాన కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసి పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు. దాదాపు 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని దాన కిషోర్ తెలిపారు. రివర్ బెడ్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పునరావాస కార్యాచరణకై సంబంధిత జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించిన తర్వాతనే ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభమవుతోందని దాన కిషోర్ వెల్లడించారు.

## మైనర్ బాలికను వేధించిన వ్యక్తి పై ఫోక్సో కేసు నమోదు



**కాగజ్ నగర్ సెప్టెంబర్ 26 ( ప్రభాత సమాచారం)**
మైనర్ బాలికను వేధించిన ఓ వ్యక్తిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు కాగజ్నగర్ డీఎస్పీ రామానుజన్ వెల్లడించారు. బుధవారం చింతనమానేపల్లిలో డీఎస్పీ పత్రిక సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం. డబ్బా గ్రామానికి చెందిన వెంకటేశ్ ఓ బాలికను వెంబడిస్తూ, అసభ్యంగా ఫొటోలు తీస్తూ లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు పంపించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

## అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**ఉట్నూర్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం)**
అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.బుధవారం ఉట్నూరు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్,పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై,పెండింగ్ లో ఉన్న బిల్లుల వివరాలను అడిగి తెలుకున్నారు.పెండింగ్ లో ఉన్న పనులను త్వరీతగతిన పూర్తి చేయాలనీ ఆదేశించారు. పెండింగ్లో ఉన్న బిల్లులను ఇప్పించేలా సీఎం రేవంత్ రెడ్డితో తాను మాట్లాడతానని పేర్కొన్నారు.అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి జ్యాప్యం వహించవొద్దన్నారు.ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే అధికారుల లక్ష్యం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్రూల్స్.. అభివృద్ధికి అడ్డు అవుతున్నాయ్ : మంత్రి సీతక్క

ఢిల్లీ: కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ లో పైసా చట్టంపై గురువారం జాతీయ సదస్సును నిర్వహించారు. పైసా చట్టం అమలు, ఎదురవుతున్న సవాళ్లపైచర్చించారు.గిరిజనాభివృద్ధి, చట్ట అమల్లోని ఇబ్బందులపై డిస్కషన్? చేశారు.ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు.. సెంట్రల్?నుంచి వచ్చిన ఫండ్స్?ని వినియోగించడంలో అటవీ శాఖ అధికారుల తీరుతో గ్రౌండ్?చేయలేకపోతున్నామని తెలిపారు.దీంతో కేంద్ర ఇచ్చిన నిధులు కూడా ఏళ్ల కొద్ది పెండింగ్?లో ఉంటున్నాయని తెలిపారు.పదిరాష్ట్రాల్లో పైసా యాక్ట్?అమల్లో ఉంది.గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రోడ్లు మౌలిక




సదుపాయాల కల్పించడంలో కొన్ని ఫారెస్ట్? రూల్స్?ఆటంకం కలిగిస్తున్నాయి.గ్రామ సభ ద్వారానే అభివృద్ధి ఏజెండాను నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలి.అటవీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలకు అధికారం ఇవ్వాలి. రాష్ట్రంలో హైడ్రా కు స్వయం ప్రతిపత్తి ఇచ్చాం. రాష్ట్రంలో పెద్దపట్టణాల్లో హైడ్రా లాంటి వ్యవస్థ ను తీసుకురావాలని డిమాండ్? వస్తుంది. కబ్జాదారులు కొంతమంది పేదలను ముందుపెట్టి వారి అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు

## చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

### కలెక్టర్ కుమార్దీపక్

మంచిర్యాల సెప్టెంబరు 26 (ప్రభాత సమాచారం):తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కుమార్దీపక్ అన్నారు. గురు వారం చాకలి ఐలమ్మ జయంతిని కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐలమ్మ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని తెలిపారు. ఐలమ్మ వర్ధంతి, జయంతిలను ప్రభుత్వం అధికారికంగా చేపట్టడం సంతో షంగా ఉందన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధికి అధికారి వినోద్కుమార్, రజక సంఘం నాయకులు బాపు, వెంకటేశం, రాజేశం, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ వర్కర్స్ ,నాన్ పర్మినెంట్ కార్మికులు , ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### కనీస వేతనాలు పెంచాలి. కార్మిక చట్టాలు అమలు చేయాలి.
### సెప్టెంబర్ 28న జిల్లా కలెక్టరేట్ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయండి
### సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్



**బెల్లంపల్లి,సెప్టెంబర్ 26( ప్రభాత సమాచారం)**
సిఐటియు మంచిర్యాల జిల్లా ముఖ్య నాయకుల సమావేశం శ్రీరాంపూర్ లోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేశారు . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మల్లికార్జున్ సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల్లోని కాంట్రాక్ట్–ఔట్సోర్సింగ్, యూనివర్సిటీ నాన్ టీచింగ్, మున్సిపల్, గ్రామ పంచాయితీ తదితర స్థానిక సంస్థలు, వైద్య ఆరోగ్య రంగం, విద్యుత్ రంగం, సింగరేణి, ఆర్టిసి తదితర రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,కనీస వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, 1979 వలస కార్మిక చట్టం పటిష్ఠంగా అమలుపర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలలి. భూపాల్ సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల అన్ని రంగాలలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 1991 నుండి అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల ఉద్యోగ భద్రత పోయి హైర్ %ు% ఫైర్ సిస్టమ్ వచ్చింది. 2014 నుండి కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల్లో మార్పు చేశారు. 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చింది. కనీస వేతనానికి గ్యారంటీ లేకుండా చేసింది. 8 గం॥ల పనిదినానికి బదులు 12 గం॥ల పనిదినం ప్రవేశపెట్టింది. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను ఫెసిలిటేట్ డిపార్టుమెంట్గా గా మార్చింది.పర్మినెంట్ వ్యవస్థను, హక్కులను పూర్తిగా రద్దు చేసింది. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, క్యాజువల్ విధానాలలో టెంపరరీ, డైలివేజ్, అప్రెంటీస్, పీస్ రేటేడ్, హెరీమ్ బేస్డ్ వర్కర్స్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్రెంటీస్లను 30% పెంచుకోడానికి అవకాశం ఇచ్చారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరిట 6, 3 నెలల కాలానికి ఒప్పందం చేసిన కమిటీ ట్రైనీ వ్యవస్థను విస్తరించింది. ఆన్ జాబ్ ట్రైనీ, లాంగ్టర్మ్ ట్రైనీ, నీమ్, నెటాప్, సీటా స్కింల పేరిట, శిక్షణ పేరిట డ్రైఫండ్ యిచ్చి యంత్రాల మీద పనిచేయిస్తూ ఉత్పత్తి పెంచుకుంటూ అతి తక్కువ వేతనాలిచ్చి శ్రమ దోపిడీకి అవకాశం కల్పించింది. యజమానులు కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్నారు. ఈ వెట్టి చాకిరీ విధానాల రద్దు కోసం పోరాడాలి. సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వాల విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల పొందికలో చాలా మార్పులు వచ్చాయి. పర్మినెంట్ వర్కర్స్ సంఖ్య పడిపోయి నాన్పర్మినెంట్ ఎంప్లాయీస్ సంఖ్య 95% పెరిగింది. ఇందులో మహిళా వర్కర్స్ సంఖ్య కూడా 25% ఉంది. ఉత్పత్తి రంగంలో 34.6%, నిర్మాణ రంగంలో 23.1%, అగ్రికల్చర్లో 12.2%, మైనింగ్ %ు% క్వారీ 4.2%, ట్రాన్స్పోర్ట్ 3.4%, ఇతర రంగాలు 2.0% చొప్పున ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్రనే కీలకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తున్నాయి.కానీ కార్మికులకు కనీస వేతనాలు పెంచడం లేదు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు చేయాలి! తెలంగాణ రాష్ట్రంలో కార్మిక శాఖ లెక్కల ప్రకారం 10 లక్షల 20 వేల మంది వలస కార్మికులు ఉన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 28న మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో పాలడుగు సుధాకర్ సిఐటియు రాష్ట్ర నాయకులు,దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి, దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, దాగం రాజారం, దూలం శ్రీనివాస్ సిఐటియు జిల్లా సహాయక కార్యదర్శులు పాల్గొన్నారు.

# హూవర్ డ్యామ్ జల విద్యుత్ స్ఫూర్తితో రాష్ట్రంలో మెరుగైన పద్ధతులు, రక్షణ చర్యలు

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు





**బెల్లంపల్లి,సెప్టెంబర్ 26( ప్రభాత సమాచారం)**
అమెరికాలోని నేవడ, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హూవర్ డ్యామ్ ఎంతో ఆదర్శవంతమైందని, ఇక్కడి నీటి వినియోగం, అమలవుతున్న రక్షణ చర్యలు ఆచరించదగినవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర ప్రతినిధి బృందంలో గల ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ఇతర అధికారులతో కలిసి హూవర్ డ్యామ్ ను సందర్శించారు. ఫెడరల్ గవర్నమెంట్ అధికారులు వారికి ప్రాజెక్టు వివరాలను స్వయంగా వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడిన కాలంలో 1931–36 మధ్య నిర్మించిన ఈ ఆర్క్ గ్రావిటీ నిర్మాణం ఒక ఇంజనీరింగ్ అద్భుతమని, ఇక్కడ గల 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తుందని అధికారులు వివరించారు. ఈ ప్రాంతంలోని మూడు ప్రధాన పట్టణాల్లో ఉన్న 80 లక్షల మంది ప్రజల మంచినీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలు కూడా హూవర్ డ్యామ్ తీరుస్తుందని వారు వివరించారు. 726 అడుగుల ఎత్తు, 1244 అడుగుల పొడవు ఉన్న ఈ డ్యామ్ వెనుక ఒక పెద్ద కృత్రిమ సరస్సు ఏర్పడిందని, పూర్తి నీటి నిలువ సామర్థ్యం ఉన్నప్పుడు 185 కిలోమీటర్ల పొడవున నీటితో విస్తరించి ఉంటుందని వివరించారు. ఏటా సుమారు 80 లక్షల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అక్కడ జరుగుతున్న జల విద్యుత్తు ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, అడుగడుగునా ఏర్పాటు చేసిన రక్షణ చర్యలు, ఇంకా ఇతర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో గల జల విద్యుత్తు ప్రాజెక్టుల సమాచారంతో బేరీజు వేస్తూ హూవర్ డ్యామ్ జలవిద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని మన ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణ మెరుగుదలకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులను కోరారు. ఈ సందర్భంగా 1931 నుండి 35 మధ్య జరిగిన డ్యామ్ నిర్మాణ దృశ్యాలను, ఫోటోలను డ్యామ్ అధికారులు ప్రదర్శించారు.

**వర్చువల్ రియాలిటీ సాయంతో బొగ్గు ఉత్పత్తి ఒక అద్భుతం**
మైనెక్స్–2024 అంతర్జాతీయ ప్రదర్శనలో బుధవారం నాడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి వివిధ ప్రఖ్యాత కంపెనీల స్టాల్స్ ను సందర్శించారు. శాండ్విక్ కంపెనీ స్టాల్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం అదే స్టాల్లో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని స్వయంగా పరిశీలించారు. ఈ వర్చువల్ రియాలిటీ ద్వారా గని లోపల పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నందు వల్ల యంత్రాలను నడిపే ఆపరేటర్లు దీనితో మెరుగైన శిక్షణ పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ వర్చువల్ రియాలిటీతో గని యొక్క పని ప్రదేశానికి యంత్రాన్ని పంపించి అక్కడి పరిస్థితులను వెలుపలు నుండే అంచనా వేస్తూ బొగ్గును త్రవ్వొచ్చని, ఇది అత్యాధునిక మైనింగ్ పద్ధతిగా నిలుస్తుందని నిర్వాహకులు చెప్పారు. శ భట్టి విక్రమార్క మల్లు స్వయంగా వర్చువల్ రియాలిటీ సాంకేతికతను హెడ్ గేర్ ధరించి పరిశీలించారు. ఈ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతం అని, ఈ ఆధునిక సాంకేతికత వల్ల కార్మికులకు చిన్న ప్రమాదం జర గకుండా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నా రు. సింగరేణి కార్మికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా సాంకేతికతను ప్రస్తుత గనుల్లో మరియు భవిష్యత్తు గనుల్లో ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని బృందంలో ఉన్న సింగరేణి సిఎండీ శ్రీ ఎన్.బలరామ్ ను కోరారు. ఈ ప్రదర్శనలో ఇంకా రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్రైం రేటు తగ్గించే విధంగా పనిచేయాలి

### రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్





**లక్షెట్టిపేట సెప్టెంబరు 26(ప్రభాత సమాచారం**
క్రైం రేటును తగ్గించే విధంగా పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీని వాస్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట పోలీస్స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. 5ఎస్ ఇంప్లిమెంటేషన్ను పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని సూచించారు. పోలీస్స్టేషన్లో ఉన్న రికా ర్డులను తనిఖీ చేశారు. నామినల్ రోల్స్ పరిశీలించి హెచ్ఆర్ఎంఎస్ తనిఖీ చేసి డ్యూటీల ప్రకారం నామినల్ రోల్లో ఉండా లని తెలిపారు. పోలీస్స్టేషన్ పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. రౌడీలు, సంఘ విద్రోహశక్తు లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. చెడు ప్రవర్తన కలి గిన వ్యక్తులపై నిఘా ఉంచి వారి కదలికలను గమ నించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్,ఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు



**కాసిపేట సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం ):**
నాలుగు రోజులుగా గ్రామ మంచినీటి సహా యకులకు ఇచ్చిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. నీటి వినియోగం, నాణ్యత, సరఫరా ఎలా చేయాలని, వాటర్ ట్యాంకుల శుభ్రత అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిం చారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రవీందర్ మాట్లాడుతూ ఎలాం టి అంతరాయం లేకుండా ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, డిప్యూటీ ఈఈ ప్రవీణ్కుమార్, ఎంపీవోసప్దర్ఆలీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయిఅచ్యుత్, శిక్షకులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కార్డుల గడువు మరో 3 నెలలు పొడిగింపు

హైదరాబాద్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం ): రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ (గుర్తింపు కార్డు) గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీతో అక్రిడేషన్ కార్డుల గడువు ముగియనుంది. తదితర కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐ అండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

## చాకలి ఐలమ్మకు కలెక్టర్ నివాళులు



**అదిలాబాద్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం )**
చాకలి ఐలమ్మ 129 వ జయంతిని పురస్కరించుకొని స్థానిక రిమ్స్ ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని, తెలంగాణ పోరాటాన్ని, త్యాగాన్ని భావితరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. వీర నారీ చాకలి ఐలమ్మ జయంతి ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.

# చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

## త్వరలో ఉట్నూర్ కేంద్రంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్







**ఉట్నూర్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం)**
తాడిత పిడిత వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ నిరంతరం పోరాడారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.భూపోరాటానికి నాంది పలికిన వీర వనిత చాకలి ఐలమ్మ అని సబ్బండవర్గాల కోసం ఆ మహనీయురాలు చేసిన త్యాగం వెలకట్టలేనిదన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆ పోరాటం అందరికి స్ఫూర్తినిస్తోందన్నారు. రాష్ట్ర మహిళ కమిషన్ లో చాకలి ఐలమ్మ వారసురాలికి చోటు ప్రభుత్వం చోటు కల్పించిందని తెలిపారు.రజక సమాజ అభివృద్ధి కృషి చేస్తామన్నారు. త్వరలో చాకలి ఐలమ్మ విగ్రహన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.భవిష్యత్తు తరాలు బాగు పడాలంటే ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు.సంకల్పం గొప్పదై ఉండాలని ఏదైనా సాదించవచ్చని పేర్కొన్నారు. త్వరలో అర్హులైన ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు.200 యూనిట్ల ఉచిత కరెంటును అందిస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం పొద్దు పొడుపు భోజ్జన్న అడుగు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణంను నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఉట్నూర్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం)**
ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఇటీవల జైనూర్ లో జరిగిన ఘటనపై రెండు రోజుల పాటు రాయిసెంటర్ సార్మెడిలు,రాజ్ గోండు సేవా సమితి,అన్ని ఆదివాసీ సంఘాలు,మైనారిటీ మత పెద్దలతో చర్చించిన విషయాలపై సిఎం రేవంత్ రెడ్డి,గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ ను జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్కతో కలసి పూర్తి నివేదికలను అందించామని పేర్కొన్నారు.త్వరలో గవర్నర్ అదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తారనీ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డితో రాయి సెంటర్, రాజ్ గోండు సేవా సమితితో పాటు అన్ని ఆదివాసీ సంఘాలను కల్పిస్తామన్నారు.%అ%జైనూరు ఘటన బాధితురాలికి న్యాయం చేస్తామని అన్నారు.ప్రతి రోజు ఆమె ఆరోగ్య పరిస్థితులను మంత్రి సీతక్క డాక్టర్లతో మాట్లాడి తెలుసుకుంటున్నారన్నారు.ఆ మహిళకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందిస్తోందనీ తెలిపారు.ఇరు వర్గాల వారు సంయమనం పాటించాలని కోరారు. ఆదివాసీల ఉద్యమాలు అర్థవంతమైనవిగా ఉండాలని అన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.నాన్ ట్రైబల్ లు 5వ షెడ్యూల్ లోనీ చట్టాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను భంగం కలగకుండా ఉండాలని సూచించారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

**ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు నిషేధం**
**సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు**
**మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి**



**ఆదిలాబాద్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం)**
శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులు సభ్యంగా కొనసాగించడానికి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో డిఎస్పి ఆపై స్థాయి అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. నిషేధిత ఆయుధాలు దురుద్దేశంతో నేరాలకు ఉసిగొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని సూచించారు.

# పెసా పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం )**
పెసా చట్టం 1996 నిబంధనల ప్రకారం పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. దీని ప్రకారం ఏ ప్రభుత్వ శాఖ అయినా చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి స్థానిక గ్రామ సభ తీర్మానం తప్పనిసరి అని అన్నారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి పెసా చట్టం లోని హక్కులు, నియమాలపై సంబంధిత తహసీల్దారులు, ఎంపీడీవోలతో మాట్లాడారు. పెసా చట్టం ప్రకారం నిర్వహించే ఈ గ్రామ సభలో గ్రామ ఓటర్లు అందరూ సభ్యులే ఉంటారని, గ్రామసభ నిర్వహణకు కావలసిన కోరం 1/3 లో కనీసం 50 శాతం గిరిజనుల హాజరు తప్పనిసరి ఉండాలని సూచించారు. ఆ తీర్మానాల నిర్ణయాలను నాలుగు వారాల లోపు సంబంధిత శాఖకు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు.తహసీల్దార్లు, ఎంపీడీవో, ఎం పి ఓ, ఎస్ డి సి తదితర సిబ్బందికి వీటి పై పవర్పా యింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గిరిజనుల హక్కుల కు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. 1/70 నిబంధనలు భారత రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్ అధికరణలు ఆదివాసీ, గిరిజనులకు రక్షణ, సామాజిక పద్ధతులు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం 1/70 చట్టాలు రూపొందించబడ్డాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన రక్షణలు ఎన్నికల్లో రిజర్వేషన్, ఏజెన్సీలో ఎస్టీలకు పదవులు, విద్యా వసతులు, ఉద్యోగాలలో ఏజ్ సడలింపు, వడ్డీ వ్యాపారుల నుంచి సంరక్షణ, ఆదివాసుల భూమి రక్షణ కోసం, మైదాన ప్రాంతవాసులు ఏజెన్సీ లోకి వలస రాకుండా అడ్డుకోవడం వంటివి సూచిస్తుందని తెలిపారు.1/1959 రెగ్యులేషన్ ప్రకారం 01.12.1963 నుండి గిరిజనుల నుంచి గిరిజనేతరులకు భూమి బదలాయింపు చెల్లదని అన్నారు. గిరిజనుల, గిరిజనేతరులకు మధ్య నెలకొన్న భూ వివాదాల పరిష్కారానికి ఏజెన్సీ కోర్టులను ఆశ్రయించాలని సూచించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో పూర్తి హక్కులు ఆదివాసీ, గిరిజనులకు ఉంటాయన్నారు. ఏజెన్సీ చట్టాలు ఉల్లంఘించినట్టైతే ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష,లేదా రూ. 2 వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చని తెలిపారు.

# మహిళల అభ్యున్నతి కోసం పక్కడ్బందీ చర్యలు

### మహిళా కమీషన్ ఛైర్పర్సన్ శ్రీమతి నేరెళ్ల శారద





**ఆదిలాబాద్ సెప్టెంబర్ 26(ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ళ శారద గురువారం అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరీ బాయి, అడిషనల్ ఎస్పీ సురేందర్ లతో కలసి కలెక్టరేట్ సమావేశం మందిరం లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారు లతో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ పోషణ మాసం సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ చట్టాల పై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, %SC, ST% ఆక్ట్ ఇక్కడున్న వారిలో ఎంతమందికి అవగాహన ఉందని, అవసరమైతే సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ముందుగా చట్టాల అమలు పై అధికారులకు అవగాహన ఉంటేనే ఇతరులకు చెప్పగలుగుతామని ఆన్నారు.ముఖ్యంగా ఇప్పుడున్న మహిళా కమిషన్ ఒక విజన్, ఎజెండాతో ముందుకు వెళుతుందని, అదిలాబాద్ జిల్లా మారుమూల ప్రాంతాల అభివృద్ధి కి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.రాష్ట్ర, కేంద్రాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అందరికీ చేరువయ్యేలా ఆయా శాఖల సమన్వయంతో పనిచేయాలని , అవసరమైతే పోలీస్, లీగల్ సపోర్ట్ తీసుకోవాలని అన్నారు.మారుమూల గ్రామాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, రెవెన్యు శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతీ విషయం పై వారికి క్షుణ్ణంగా తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గతం లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామాల్లో అవర్నేస్ తీసుకురావాలని కోరారు.గంజాయిని అరికట్టాలని, చట్టాల పై అవగాహన ఉంటే ఎలాంటి తప్పు చేయరని, శిక్ష పడుతుందన్న భయం వారిలో ఉంటుంది కనుక తప్పనిసరిగా చట్టాల పై అవగాహన కల్పించాలని ఆన్నారు.ఈ సందర్భంగా నాలుగు జిల్లాల మహిళా సంక్షేమ అధికారులు లు, సీడీపీఓ లు , వైద్యం, మెప్మా , తదితర శాఖల వారీగా జిల్లా లో చేపడుతున్న అభివృద్ధి పనుల తీరును కమిషన్ ఛైర్పర్సన్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్పర్సన్ అధికారులందరూ ప్రాక్టికల్ గా గ్రౌండింగ్ చేయాలని, ఎలాంటి కేసులు, న్యూట్రిషన్ ప్రాబ్లం, తదితర సమస్యలు రాకుండా గ్రామాల్లో పర్యవేక్షించి , అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆన్నారు.

# గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే




**ఆసిఫాబాద్, సెప్టెంబరు 26(ప్రభాత సమాచారం)**
గిరిజన ప్రాంతచట్టాలు 1/70, పేసాచట్టంపై అధికారులు అవగాహన కలిగిఉడాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన చట్టాలపై గిరిజన సంక్షేమ వాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజన ప్రాంతాలలో ఉన్న భూ చట్టాలు, పేసా చట్టాలను అందరు రక్షించాలని చెప్పారు. చట్టాల ఉల్లంఘన జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐదో షెడ్యూల్డ్ ప్రకారం గిరిజన ప్రాంతంలో రాజ్యాంగం గిరిజనుల కోసం ఎన్నో చట్టాలు తీసుకు వచ్చారని చెప్పారు. గిరిజనులు సంక్షేమం, హక్కుల రక్షణ కోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. గిరిజన చట్టాలలో ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేకాదికారి ఎంఎ ఆదిల్ ఏజెన్సీ చట్టాలు, పేసా చట్టాలలో పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్రావు గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఉట్నూర్ ఎస్డీసీ గంగాధర్ ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు శుభవార్త.. 18వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ. 2 వేలచొప్పున మూడు వాయిదాలలో డబ్బు ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ.2 వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అంటున్నారు అధికారులు. ఇందుకోసం... ఫార్మర్ కార్నర్.. విభాగంలోని ఈకేవైసీ ఆప్షన్పై క్లిక్ చేయాలి. 12 అంకెల ఆధార్ నంబర్ను టైప్ చేయాలి. 'సెర్చ్' బటన్పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేయాలి. ప్రక్రియను పూర్తి చేయడానికి సబ్మిట్ నొక్కాలి. తద్వారా ఈకేవైసీ పూర్తవుతుంది.

**రైతులు చేయాల్సిన ముఖ్యమైన పనులివే..** 1. eKYC పూర్తి చేయాలి. . బ్యాంక్ ఖాతాను ఆధార్తో లింక్ చేయాలి. 3. భూమి రికార్డులను ధృవీకరించాలి.

**ఆధార్ లింక్ తప్పనిసరి..** పీఎం కిసాన్ నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డీబీటీ) వ్యవస్థ ద్వారా బదిలీ అవుతాయి. ఇందుకోసం బ్యాంక్ ఖాతాను మీ ఆధార్ నంబర్తో లింక్ చేయాలి. పీఎం కిసాన్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే.. ఆధార్, బ్యాంక్ అకౌంట్, భూ రికార్డులను ధృవీకరించాల్సి ఉంటుంది.




హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి స్పందించారు. ప్రసాదం అపవిత్రం కావడంపై హిందువులంతా బాధపడుతున్నారన్నారు. "తితిదే ఎంతో పవిత్రమైంది. నమ్మకం లేనపుడు హిందూ ఆలయాలకు ఎందుకు వెళ్తున్నారు. ప్రసాదం అపవిత్రం చేసినవాళ్లు తిరుమలకు ఎందుకు వెళ్తానంటున్నారు.. ఇది సరైందేనా?"అని పరోక్షంగా వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## సిరిసిల్ల నేతలన్న తరపున పోరాటానికి సిద్ధం: కేటీఆర్



సిరిసిల్ల: భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం. కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరఫున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి"అని కోరారు.




దిల్లీ: దేశీయంగా పసిడి ధర మళ్లీ పెరిగింది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి (24 క్యారెట్లు) ధర గురువారం మరో రూ.400 పెరిగి రూ.78 వేల మార్కును చేరుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ నెలకొనడం, దేశీయంగానూ వర్తకుల నుంచి కొనుగోళ్లు కొనసాగుతుండడం పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణాలుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బుధవారం రూ.77,850 వద్ద ముగిసిన బంగారం ఇవాళ మరో రూ.400 పెరిగి తాజా గరిష్ఠమైన రూ.78,250 మార్కును దాటినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరోవైపు వెండికీ పసిడితో సమానంగా డిమాండ్ కొనసాగుతోంది. కిలో వెండి తాజాగా మరో వెయ్యి రూపాయలు పెరిగి రూ.94వేల మార్కు చేరుకోవడం గమనార్హం. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఔన్సు 2701 డాలర్లు పలుకుతోంది.

ద్రవ్యోల్బణం కట్టడికి ఇన్నాళ్లూ వడ్డీ రేట్లు పెంచుకుంటూ వచ్చిన కేంద్ర బ్యాంకులు... ఇప్పుడు వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించేందుకు ముందుకొస్తున్నాయి.

దీనికి తోడు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. డాలరు ధర క్షీణించడం కూడా మరో కారణమని తెలిపారు.

## వరద నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.. - కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ: వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నిలువకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో నీరు నిలిచే చోట శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. మరో సమీక్షలో నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. వైద్యారోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని..యాంటీ లార్వల్, ఫాగింగ్ విస్తృతం చేయాలని పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




కొండాపూర్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామం కుతుబ్‌శాయి పేట్ గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని గుర్తించారు. కొందరు వ్యక్తులు చెరువులోనే బహుళ అంతస్తుల భవనం కట్టడంతో చర్యలు తీసుకున్నారు. బాంబుల ద్వారా అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో బాంబులు పేలి శిథిలాలు ఎగిరిపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి 12 సంవత్సరాల క్రితం మల్కాపురం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ భవనాన్ని నిర్మించారు. నీళ్లలో అడుగుపెట్టకుండా లోనికి వెళ్లడానికి కొంత దూరం నుంచే మెట్లు కట్టారు. యజమాని కుటుంబ సభ్యులు వారాంతాల్లో వచ్చి ఇక్కడ సేదతీరుతూ ఉండేవారు.

## అధికారులు ఎలాంటి తప్పు చేయకూడదో ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవు. నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు.

దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే" అని సీఎం అన్నారు.




హైదరాబాద్: మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. "విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తారు"అని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని కోరారు.



## జర్నలిస్ట్ మృతిపై తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ టి ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌పై వాకింగ్ చేస్తుండగా జారిపడ్డారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోకి తీసుకెళ్లేలోపు చనిపోయారు. గత 25 ఏళ్ల నుంచి నారాయణ ఈటీవీలో పనిచేస్తున్నారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**సీఎం రేవంత్ సంతాపం :** నారాయణ మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. నారాయణ అకాల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

నారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## శ్రీవారికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా మాధవీలత ఏం చేశారంటే..

హైదరాబాద్, సెప్టెంబర్ 26: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై తెలంగాణ బీజేపీ మహిళా నేత, ఫైర్ బ్రాండ్ మాధవీలత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హిందువులు పవిత్రంగా స్వీకరించే శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారంటే అది అత్యాచారం కిందకే వస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా వెంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా తిరుమలకు వెళ్లాలని ఆమె నిర్ణయించారు. అందులో భాగంగానే సహచర భక్త బృందంతో కలిసి మాధవీలత తిరుమలకు బయలుదేరారు. వందేభారత్ రైలులో బీజేపీ మహిళా నేత హైదరాబాద్ నుంచి తిరుమలకు పయనమయ్యారు. వేంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా నడక మార్గంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని బీజేపీ నేత దర్శించుకోనున్నారు. సహచర భక్త బృందంతో కలిసి ఆ గోవిందుడి నామం జపిస్తూ.. శ్రీనివాసుడి పాటలు పాడుతూ భజన చేస్తూ వందేభారత్‌తో రైలులో మాధవీలత తిరుమలకు బయలుదేరారు. మరోవైపు.. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనను ప్రతీఒక్కరూ వ్యతిరేకిస్తున్న పరిస్థితి. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రకంపనలు రేపింది. ప్రతీ ఒక్క హిందువు, హిందూ సంఘాలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ప్రసాదాన్ని హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారు. అటువంటి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారని నిర్ధారణ అవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు సంస్థను(సిట్) కూడా ఏర్పాటు చేసింది. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. అక్టోబర్ 1న పవన్ తిరుమలకు వెళ్లి దీక్షను విరమించనున్నారు. అలిపిరి మెట్ల మార్గన తిరుమలకు వెళ్లి.. స్వామి వారిని దర్శించుకుని దీక్షను విరమించనున్నారు డిప్యూటీ సీఎం.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660